

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

తెలుగు దిన పత్రిక

PRGI NO: APTEL/26/A5450

సత్య శోధనే మా లక్ష్యం...

విజయవాడ శనివారం 10-10-2026 సంపుటి: 02 సంచిక : 100 వెల: 2 రూ పేజీలు :04 సంపాదకులు: కట్ట హిమ పావని

Vijayawada Saturday, 10-10-2026 Volume :02 Issue:100 RS: 2 Pages:04 Editor : Katta HimaPavani





Contact Number
9059328777


## హోప్, రూథర్‌ఫోర్డ్ వీర విధ్వంసం




- భారత్‌పై విండీస్ సంచలన విజయం
- రెండో టీ20లో ఆరు వికెట్లతో వెస్టిండీస్ ఘన విజయం
- 249 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన కరీబియన్లు
- కెప్టెన్ హోప్ అజేయ శతకం.. రూథర్‌ఫోర్డ్ మెరుపులు
- శామ్సన్, ఇషాన్, తిలక్ వర్మల దూకుడు బ్యాటింగ్
- 18.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకున్న విండీస్
- ఐదు మ్యాచ్‌ల సిరీస్ 1-1తో సమం

## కాక్రోచ్‌ల జంగ్‌పై
# టెన్షన్..టెన్షన్

### సీఈసీకి వ్యతిరేకంగా నేడే జంతర్‌మంతర్‌లో ఆందోళన

- నిరసనకు అనుమతి నిరాకరణ.. చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు: పోలీసులు
- ఢిల్లీలో భారీగా పోలీసు, పారామిలిటరీ బలగాల మోహరింపు
- 38 రైళ్లు రద్దు.. 57 మెట్రో స్టేషన్లు మూసివేత
- సెంట్రల్ ఢిల్లీలో 24 గంటలపాటు ఇంటర్నెట్ సేవలు నిలిపివేత
- రిటైల్ మద్యం దుకాణాలు మూసివేత.. క్యాబ్ సేవలపై ఆంక్షలు
- కేంద్రం ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తోందని సీజేపీ ఆరోపణ
- యువతకు భయపడి దేశాన్ని మూసివేస్తున్నారని అభిజిత్ దీప్ విమర్శ
- ముందస్తు అరెస్టులు జరుగుతున్నాయని విద్యార్థి సంఘాల ఆరోపణ
- వెనక్కి తగ్గేది లేదని.. నిరసనలో పాల్గొనాలని నేహా బోరా పిలుపు

**ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తలపెట్టిన ఆందోళనపై ఉత్కంఠ నెలకొంది. నిరసనకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో రాజధానిలో భద్రతను కట్టుదిట్టం చేశారు. 38 రైళ్ల రద్దు, 57 మెట్రో స్టేషన్ల మూసివేత, సెంట్రల్ ఢిల్లీలో 24 గంటలపాటు ఇంటర్నెట్ సేవల నిలిపివేతతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. అయినప్పటికీ ఆందోళన కొనసాగిస్తామని సీజేపీ, విద్యార్థి సంఘాల నేతలు ప్రకటించడంతో ఢిల్లీలో ఏం జరగబోతోందన్న ఉత్కంఠ నెలకొంది.**

న్యూఢిల్లీ :

సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా ప్రధాన డిమాండ్‌తో శనివారంనాడు కాక్రోచ్ జనతా పార్టీ, వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో తలపెట్టిన ఆందోళనపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఒకవైపు ఢిల్లీలో భారీ ఎత్తున పోలీసులు, బలగాలను మోహరించడం, సిజెపి ఆందోళనకు అనుమతి లేదని పోలీసులు అధికారులు ప్రకటించడం, ఎట్టి పరిస్థితుల్లో వెనక్కి తగ్గబోమని సిజెపితో పాటు విద్యార్థి సంఘాలు పట్టుబడుతున్న నేపథ్యంలో

-మిగతా 2 లో





### ఏపీలో స్థానిక ఎన్నికలకు
# లైన్ క్లియర్.

- వైసీపీ దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత
- ఎస్ఐఆర్ పూర్తయ్యే వరకు వేచి ఉండాలన్న వాదనకు అంగీకరించని కోర్టు
- పాత లేదా తాజా ఓటర్ల జాబితాతో ఎన్నికలు నిర్వహించుకోవచ్చని స్పష్టీకరణ
- వార్డుల పునర్విభజనతో ఎన్నికలు ఆలస్యం చేయొద్దని వ్యాఖ్య

అమరావతి, ఏపీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఓటర్ల జాబితా, వార్డుల పునర్విభజన అంశాలపై కీలక స్పష్టత ఇచ్చింది. దీంతో రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై ఉత్కంఠకు తెరపడినట్లయింది.

ఓటర్ల జాబితాపై విచారణ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికలు నిర్వహించకూడదన్న వైసీపీ

-మిగతా 2 లో



## ఈగను చంపేందుకు సుత్తిని వాడుతారా?

- మెట్రో సర్వీసుల నిలిపివేతపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం
- కేంద్రం నిర్ణయాన్ని తప్పుబట్టిన జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం
- 57 మెట్రో స్టేషన్ల మూసివేతపై ప్రశ్నలు
- ఆంక్షలను పునఃపరిశీలించాలని కేంద్రానికి సూచన
- నిరసన హక్కుతో పాటు ప్రజల హక్కులకూ ప్రాధాన్యం
- లక్షలాది మందికి మెట్రో, రైళ్లే ప్రయాణ ఆధారం
- రైళ్ల ఫ్రీక్వెన్సీ తగ్గించవచ్చు.. పూర్తిగా రద్దు చేయొద్దు
- మూసివేసిన రహదారులను తెరిచే అంశాన్ని పరిశీలించాలని ఆదేశం

02

## ఉగ్రవాదంపై భారత్ జీరో టాలరెన్స్

- ఐరాస వేదికగా ఉగ్రవాదంపై భారత్ స్పష్టమైన ప్రకటన
- సీమాంతర ఉగ్రవాదంపై రాజీలేని పోరాటం
- ఉగ్రవాదాన్ని ఏ రూపంలోనూ సమర్థించలేమని వెల్లడి
- ఉగ్ర నెట్‌వర్క్‌లపై ప్రపంచ దేశాలు ఏకతాటిపైకి రావాలి
- ఉగ్రవాద నిరోధానికి అంతర్జాతీయ సహకారం అవసరం
- ఉగ్రవాదంపై పాక్ ద్వంద్వ వైఖరిని ఎండగట్టిన భారత్




### స్మిత్ మచ్చర్‌కు ఇజ్రాయెల్
## అత్యున్నత పౌర పురస్కారం

- పై దుబాయ్ విమాన హైజాక్ యత్నాన్ని అడ్డుకున్న భారత పైలట్
- 174 మందిని కాపాడిన ధైర్యసాహసాలకు అరుదైన గౌరవం
- కోలుకున్న తర్వాత అవార్డు అందజేస్తామన్న ఇజ్రాయెల్ అధ్యక్షుడు
- స్మిత్ తెగువను కొనియాడిన మోదీ, నెతన్యాహు, ట్రంప్
- పైలట్ సాహసాన్ని ప్రశంసించిన అమెరికా కాంగ్రెస్ సభ్యుడు
- అబుదాబి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కెప్టెన్ మచ్చర్







## సంజామలను కరువు మండలంగా ప్రకటించాలి

చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి డిమాండ్.. నిరసన ర్యాలీలో పాల్గొని సంఘీభావం

నంద్యాల

నంద్యాల జిల్లాలోని సంజామల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. బనగానపల్లె నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో సంజామల మండల కేంద్రంలోని కోట బురుజు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించిన నిరసన ర్యాలీలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడు, కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు లేక రాష్ట్రంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కొన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ, సంజామలను ఆ జాబితాలో చేర్చకపోవడంతో ఇక్కడి రైతులు, ప్రజలు నష్టపోతున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించి, పంటలకు నీరు లేకపోవడం, అరకొరగా పండిన పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవడం, అప్పులు తీర్చలేక రైతులు పడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని

-మిగతా 2 లో

## 34 శాతం కన్నా
# ఎక్కువే ఇస్తాం

- బీసీలంటే గొడ్డలి పార్టీకి గిట్టదు
- అందుకే కోర్టుకెళ్లి రిజర్వేషన్లు అడ్డుకుంది
- అయినా టీడీపీ కట్టుబడి ఉంది
- వైసీపీ పాలనను ఓసారి గుర్తుచేసుకోండి
- అప్పట్లో ఎటుచూసినా విధ్వంసమే
- భూ వివాదాలు, ఆక్రమణలు, దందాలు..
- అలాంటి పరిస్థితి మళ్లీ రాకూడదు
- రైతు సమస్య పరిష్కారమే మా లక్ష్యం
- రాజముద్రతో 40 లక్షల పాస్‌పుస్తకాలిచ్చాం
- వచ్చే మార్చినాటికి మరో 51.91 లక్షలు
- వచ్చే రెండేళ్లలో 20 లక్షల కోట్ల పెట్టుబడులు
- 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- ప్రకాశం జిల్లా సభలో సీఎం చంద్రబాబు

02

### స్థానిక ఎన్నికల్లో పార్టీ తరఫున బీసీలకు సీట్లు

**జనాభాలో 50 శాతం కన్నా అధికంగా వెనుకబడిన తరగతులవారు ఉన్నారు. వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ ఇచ్చి ప్రాతినిధ్యం పెంచాలని భావించాం. కానీ గొడ్డలి పార్టీ కోర్టుకు వెళ్లి అడ్డుకుంది. సుప్రీం కోర్టును ఆశ్రయిస్తే అక్కడ ప్రభుత్వ వాదనకు విరుద్ధంగా తీర్పు వచ్చింది. అయినా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున బీసీలకు 34 శాతం కన్నా ఎక్కువ సీట్లు ఇస్తాం.**






## తెలంగాణ జలదోపిడీ ఆపండి!

- విద్యుత్ కోసం రోజుకు టీఎంసీన్నర తోడేస్తోంది
- ఇలాగైతే కొద్దిరోజుల్లోనే కనీస మట్టానికి శ్రీశైలం డ్యాం
- కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్‌కు నిమ్మల లేఖ

అమరావతి,

తెలంగాణ జలదోపిడీని అరికట్టి ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా జలాల్లో న్యాయబద్ధమైన వాటా దక్కేందుకు తక్షణమే జోక్యం చేసుకోవాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో నిల్వ ఉన్న 73.53 టీఎంసీల (846.90 అడుగులు)ను కాపాడేందుకు తగు ఆదేశాలివ్వాలని అభ్యర్థించారు. ఈ మేరకు పాటిల్‌కు శుక్రవారం లేఖ రాశారు. తెలంగాణ విద్యుదుత్పత్తి కోసం రోజుకు ఒకటిన్నర టీఎంసీ తోడేస్తోందని.. ఇలాగైతే కొద్ది రోజుల్లోనే శ్రీశైలం జలాశయం కనీస మట్టానికి చేరుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి రాయలసీమ తాగునీటి అవసరాలకు కృష్ణా జలాలు తరలించాలంటే కనీసం 834 అడుగుల మేర శ్రీశైలంలో నీటి నిల్వలు ఉండాల్సిందేనని నిమ్మల గుర్తుచేశారు. డ్యాం డెడ్ స్టోరేజీ 34.29 టీఎంసీలని..

-మిగతా 2 లో

WWW.NETIDARSHINI.COM
PRGI NO:APTEL/26/A5450
తెలుగు దిన పత్రిక
సత్య శోధనే మా లక్ష్యం
www.epaper.netidarshini.com
శనివారం 10-10-2026


# హోప్, రూథర్‌ఫోర్డ్ వీర విధ్వంసం

**రాంచి**



భారీ స్కోరు చేసినా టీమిండియాకు విజయం దక్కలేదు. భారత బ్యాటర్లు ధాటిగా ఆడటంతో 249 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించినా.. వెస్టిండీస్ ఆటగాళ్లు అంతకుమించిన విధ్వంసంతో చెలరేగారు. కెప్టెన్ షాయ్ హోప్, రూథర్‌ఫోర్డ్ వీరవిహారంతో రెండో టీ20లో కరీబియన్లు ఆరు వికెట్ల తేడాతో సంచలన విజయం సాధించారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. అనంతరం విండీస్ 18.3 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ విజయంతో సిరీస్‌ను 1-1తో సమం చేసింది. 250 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. ఓపెనర్ కామిన్ పూరన్ (4), హెట్‌మైయర్ (0) నిరాశపరిచారు. రోవ్‌మన్ పావెల్ (24) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. దీంతో విండీస్ కష్టాల్లో పడినట్లు కనిపించింది. ఈ దశలో కెప్టెన్ షాయ్ హోప్, రూథర్‌ఫోర్డ్ భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. రూథర్‌ఫోర్డ్ కేవలం 37 బంతుల్లో ఏడు ఫోర్లు, ఏడు సిక్సర్లతో 84 పరుగులు చేశాడు. మరోవైపు హోప్ 45 బంతుల్లో తొమ్మిది సిక్సర్లు, ఆరు ఫోర్లతో అజేయంగా 102 పరుగులు సాధించాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 54 బంతుల్లోనే 120 పరుగులు జోడించి జట్టును విజయతీరాలకు చేర్చారు. చివర్లో రొమారియో షెఫర్డ్ 13 బంతుల్లో 34 పరుగులతో నాటౌట్‌గా నిలిచి విజయాన్ని ఖాయం చేశాడు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన టీమిండియాకు ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజు శాంసన్ అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. అభిషేక్ 12 బంతుల్లో రెండు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 20 పరుగులు చేసి వెనుదిరిగాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్.. శాంసన్‌తో కలిసి దూకుడు పెంచాడు. ఇషాన్ 22 బంతుల్లో ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 43 పరుగులు చేశాడు. ఈ క్రమంలో వీరిద్దరూ రెండో వికెట్‌కు 43 బంతుల్లోనే 97 పరుగులు జోడించారు. శివమ్ దూబే (7) విఫలమైనా.. శాంసన్ తన దూకుడును కొనసాగించాడు. శాంసన్ 82 పరుగులతో ఆకట్టుకోగా, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 18 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 40 పరుగులు చేశాడు. తిలక్ వర్మ 18 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్సర్లతో అజేయంగా 44 పరుగులు సాధించాడు. దీంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 249 పరుగులు నమోదు చేసింది. అయితే భారత బౌలర్లు ఆ స్కోరును కాపాడలేకపోవడంతో జట్టుకు ఓటమి తప్పలేదు.

# ఈగను చంపేందుకు సుత్తిని వాడుతారా?

న్యూఢిల్లీ,

నిరసనలను నియంత్రించే పేరుతో ప్రజా రవాణా వ్యవస్థను పూర్తిగా నిలిపివేయడం సరికాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. 'ఈగను చంపేందుకు భారీ సుత్తిని ఉపయోగించకూడదు' అని వ్యాఖ్యానిస్తూ, ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళన నేపథ్యంలో మెట్రో సర్వీసులు, ఇతర రైళ్లపై విధించిన ఆంక్షలను ప్రశ్నించింది. శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి 57 మెట్రో స్టేషన్లను మూసివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తప్పుబట్టింది. ఈ నెల 10న జరగనున్న ఆందోళనను దృష్టిలో ఉంచుకుని మెట్రో, సాధారణ రైలు సర్వీసుల నిలిపివేతను సవాల్ చేస్తూ సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు లక్షలాది మంది ప్రజలు మెట్రోలు, రైళ్లపై ఆధారపడుతున్నారని సుప్రీంకోర్టు గుర్తుచేసింది. గురుగ్రామ్, గ్రేటర్ నోయిడా, తూర్పు ఢిల్లీ, దక్షిణ ఢిల్లీ ప్రాంతాలకు ఉపాధి, విద్య, ఇతర అవసరాల కోసం నిత్యం ప్రయాణాలు సాగించే వారందరికీ సొంత వాహనాలు ఉండవని పేర్కొంది. యువత నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ ప్రాథమిక సౌకర్యాలను పొందే హక్కు ఉందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయడం వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. నిరసన తెలిపే హక్కును గౌరవిస్తూనే, ఇతర పౌరుల హక్కులకు భంగం కలగకుండా చూడాలని ధర్మాసనం సూచించింది. ఆంక్షలు విధించడానికి, పూర్తిస్థాయిలో నిషేధం విధించడానికి మధ్య వ్యత్యాసం ఉందని వ్యాఖ్యానించింది. అవసరమైతే మెట్రో రైళ్ల రాకపోకల ఫ్రీక్వెన్సీని తగ్గించవచ్చుని, అయితే సర్వీసులను పూర్తిగా రద్దు చేయడం సమంజసం కాదని పేర్కొంది. మూసివేసిన రహదారులను తిరిగి తెరిచే అంశాన్ని కూడా పునఃపరిశీలించాలని కేంద్రానికి సూచించింది.

## 34 శాతం కన్నా ఎక్కువే ఇస్తాం



ఒంగోలు,

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం కన్నా అధికంగానే సీట్లు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. వారందరినీ గెలిపించుకుని తీరుతామని ఉద్ఘాటించారు. గొడ్డలి పార్టీ కోర్టుకు వెళ్లి అడ్డుకున్నా సరే బీసీల ప్రాతినిధ్యం పెంచేందుకు టీడీపీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. శుక్రవారం ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలోని జరుగుమల్లి మండలం నర్సింగోలు గ్రామంలో మీభూమి-మీహక్కు కార్యక్రమం సందర్భంగా జరిగిన సభలో ఆయన పాల్గొన్నారు. వేలాదిగా తరలివచ్చిన రైతులు, మహిళలు, ప్రజలనుద్దేశించి మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తాజా తీర్పుపై సభలో చంద్రబాబు స్పందించారు. సామాజికంగా, ఆర్థికంగా బీసీలను అభివృద్ధి చేసింది తెలుగుదేశం పార్టీనే అన్నారు. ఎన్టీఆర్ పాలనలో బీసీలకు 24 శాతం రిజర్వేషన్లు ఇస్తే, తాను వచ్చాక 34 శాతం చేశానని, గత వైసీపీ ప్రభుత్వం దానిని 24 శాతానికి తగ్గించిందని విమర్శించారు. వైసీపీ నిర్వాకంతో 16,800 పదవులు బీసీలు కోల్పోయారన్నారు. తిరిగి కూటమి వచ్చాక 34 శాతం రిజర్వేషన్లను నిర్ణయిస్తే, దానిని వ్యతిరేకిస్తూ గొడ్డలి పార్టీ వాళ్లు కోర్టుకు వెళ్లారని అన్నారు. తొలి నుంచి గొడ్డలి పార్టీకి బీసీలంటే వ్యతిరేకత, చిన్నచూపే ఉందని విమర్శించారు. హైకోర్టు, సుప్రీంకోర్టు 34 శాతం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పులు ఇచ్చాయని, అయితే అంతకన్నా అధికంగానే పార్టీ పరంగా బీసీలకు సీట్లుఇచ్చి గెలిపిస్తామని చెప్పారు. స్థానిక ఎన్నికలంటే గొడ్డలి పార్టీకి వెన్నులో వణుకు పుడుతోందని, ఎన్నికల్లో ఓటమి చెందాక గ్రామాల్లో వారి కార్యకర్తలు బయటకురారని భయపడుతూ ఎలాగోలా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. 'సర్'ను ఒకవైపు వ్యతిరేకిస్తూ మరోవైపు అది పూర్తయ్యాక ఎన్నికలు పెట్టాలని కోర్టుకు వెళ్లి రెండు నాల్కల ధోరణి ప్రదర్శించారని చంద్రబాబు విమర్శించారు.

**స్థానిక ఎన్నికల్లోనూ ఆశీర్వదించండి:**

నీటి సౌకర్యంతో అభివృద్ధి సాధ్యమన్న చంద్రబాబు.. పట్టిసీమతో కృష్ణా డెల్టాకు గోదావరి నీరు తీసుకురావడం వల్ల శ్రీశైలం నుంచి వెలిగొండకు నీరివ్వగలిగామని వివరించారు. గోదావరి-కావేరి అనుసంధానర చేస్తే ఐదు రాష్ట్రాలు, ఐదు జీవనదులు అనుసంధానమై అన్ని ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. ప్రధాని మోదీతోనూ ఈ విషయంపై చర్చించానని చెప్పారు. వెలిగొండ రెండోదశను కూడా రెండేళ్లలో పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. ప్రజాసమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు, సంపద వృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న మంచి ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. 'మంచి పని చేసేవారిని గుర్తిస్తే మంచి జరుగుతుంది. ఓసారి గత వైసీపీ పాలనను గుర్తుచేసుకోండి. అప్పట్లో ఎవరి మొహంలో నవ్వు అన్నది లేదు. ఇంట్లో, బయట కూడా భద్రత లేదు. ఎటుచూసిన విధ్వంసమే సాగింది. అలాంటి పరిస్థితి మళ్లీ రాష్ట్రానికి రాకూడదు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి అపూర్వ విజయం అందించినట్లు స్థానిక ఎన్నికల్లోనూ ప్రజలు ఆశీర్వదించండి' అని కోరారు.

# కాక్రోచ్‌ల జంగ్‌పై టెన్షన్..టెన్షన్

(మొదటి తరువాయి)



టెన్షన్ వాతావరణం ఏర్పడింది. న్యూఢిల్లీ రేంజ్ జాయింట్ కమిషనర్ సుపూర్ ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ.. గతంలో సిజెపి ఆందోళనల్లో చోటు చేసుకున్న నిబంధనల ఉల్లంఘన, హింసను దృష్టిలో పెట్టుకుని తాజా నిరసనకు అనుమతి నిరాకరించినట్లు చెప్పారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ప్రసాద్ తెలిపారు. ప్రజల భద్రతకు తాము ప్రాముఖ్యతనిస్తున్నామన్నారు. సిజెపి కో కన్వీనర్ సౌరభ్ దాస్ నుంచి నిరసనకు సంబంధించిన దరఖాస్తు ఆలస్యంగా అందిందని, ఇలాంటి వాటికి పది రోజుల ముందే తమకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని ప్రసాద్ తెలిపారు. మరోవైపు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి శ్రేణురాను ఢిల్లీ చేరుకునే రైలు సర్వీసులను ఆ శాఖ రద్దు చేసింది. ప్రధానంగా ఢిల్లీ--హజ్రత్ నిజాముద్దీన్, రాజధాని రైలు సర్వీసులు సహా 38 రైళ్లను రద్దు చేసింది. మిగతా 120కిపైగా సర్వీసులు యథావిధిగా నడుస్తాయని ప్రకటించింది. ఢిల్లీలో మెట్రో రైలు సేవలపై కూడా ఆంక్షలు విధించారు. 57 మెట్రో స్టేషన్లను మూసివేశారు. మిగతా స్టేషన్లు ప్రజలకు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. తద్వారా ఆందోళనకారులకు ఢిల్లీ చేరుకోవడానికి ఉన్న రవాణా సదుపాయానికి ఆటంకాలను ప్రభుత్వం సృష్టిస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక సెంట్రల్ ఢిల్లీలో శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి శనివారం రాత్రి 10 గంటల వరకు ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఢిల్లీ పోలీసులు ఆంక్షలు కఠినం చేశారు. అశోకారూడ్, జంతర్‌మంతర్ సమంలో భారీగా బారికేడ్లను ఏర్పాటు చేశారు. సీఈసీ జ్ఞానేశ్ నివాసంతో పాటు ఈసీ కార్యాలయం వద్ద భారీ ఎత్తున భద్రత ఏర్పాట్లు చేశారు. శుక్ర, శనివారాల్లో ఢిల్లీలోని రిటైల్ మద్యం దుకాణాలను మూసివేయించారు. ఓలా, ఉబెర్ సేవలపై పరిమితులు విధించారు. స్కూళ్లు, విద్యాసంస్థల సమయాల్లో మార్పులు చేశారు.

**కేంద్రం భయపడింది : సిజెపి**

జెన్ జడ్ ఆందోళనలకు కేంద్రంలో భయపట్టుకుందని సిజెపి నేతలు మండిపడ్డారు. ఢిల్లీలో ఆంక్షలు విధించినా నిరసన చెప్పేదతామని స్పష్టం చేశారు. దేశంలో అత్యవసర తరహా పరిస్థితిని తీసుకువచ్చారని, ఆ కోపంలోనే రైళ్లు, ఇంటర్నెట్ బంద్ తరహా నిర్ణయాలు తీసుకున్నారని దుయ్యబట్టారు. ప్రజల ప్రజాస్వామిక హక్కును కేంద్ర కలరాస్తోందని సిజెపి చీఫ్ అభిజిత్ దీప్ ఆరోపించారు. ముంబైలో ఆయన మీడియాతో మాట్లాడారు. సిజెపి వలంటీర్లు ఒక ప్రణాళిక ప్రకారం జంతర్‌మంతర్ చేరుకుంటారని ఆయన తెలిపారు. యువతకు భయపడితే దేశం మొత్తాన్ని మూసివేసిందన్నారు. 56 అంగుళాల ఛాతీ ఆందోళనలకు బెదిరిపోతోందని, మీ బీపీని ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని మోడీ ఉద్దేశించి దీప్ వ్యంగాస్త్రాలు సంధించారు. తాజా పరిస్థితిని మరో నేత సౌరవ్ దాస్ అత్యవసర పరిస్థితితో పోల్చారు.

**వెనక్కి తగ్గేది లేదు : నేహా బోరా**

జంతర్ మంతర్‌లో తలపెట్టిన ఆందోళనపై వెనక్కి తగ్గేది లేదని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నేహా బోరా స్పష్టం చేశారు. తమ విద్యార్థి నేతలు అరెస్ట్ అయినా ప్రజలు నిరసనలో పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. ఢిల్లీలో భారీ ఎత్తున ముందస్తు అరెస్టులు కొనసాగుతున్నాయని, ఆందోళనకారుల కోసం పోలీసులు వేటాడుతున్నారని ఆమె ఆరోపించారు. భారీ ఎత్తున పారామిలిటరీ బలగాలు, పోలీసులను దించుతున్నారని, ఇది నిజంగా దేశంలో ఎమర్జెన్సీ పరిస్థితే అని అన్నారు..

# ఉగ్రవాదంపై భారత్ జీరో టాలరెన్స్

- -ఐరాస వేదికగా ఉగ్రవాదంపై భారత్ స్పష్టమైన ప్రకటన
- -సీమాంతర ఉగ్రవాదంపై రాజీలేని పోరాటం
- -ఉగ్రవాదాన్ని ఏ రూపంలోనూ సమర్థించలేమని వెల్లడి
- -ఉగ్ర నెట్‌వర్క్‌లపై ప్రపంచ దేశాలు ఏకతాటిపైకి రావాలి
- -ఉగ్రవాద నిరోధానికి అంతర్జాతీయ సహకారం అవసరం
- -ఉగ్రవాదంపై పాక్ ద్వంద్వ వైఖరిని ఎండగట్టిన భారత్



ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ అనుసరిస్తున్న 'జీరో టాలరెన్స్' విధానాన్ని ఐక్యరాజ్యసమితి వేదికగా మరోసారి స్పష్టం చేసింది. సీమాంతర ఉగ్రవాదంపై తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, ఉగ్రవాదాన్ని ఏ రూపంలోనూ సమర్థించలేమని తేల్చిచెప్పింది. న్యూయార్క్‌లో జరుగుతున్న ఐరాస సర్వప్రతినిధి సభ సమావేశాల్లో రాజ్యసభ సభ్యుడు సికందర్ కుమార్ నేతృత్వంలోని భారత పార్లమెంటరీ ప్రతినిధి బృందం పాల్గొంది. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి ఉగ్రవాద నిరోధక కార్యాలయం (యుఎన్‌ఓసిటి) తాత్కాలిక అండర్ సెక్రటరీ జనరల్ అలేగ్జాండర్ జుయెవ్‌తో ప్రతినిధి బృందం సమావేశమైంది. ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు భారత్, ఐరాస మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయడం, నిఘా సమాచార మార్పిడి, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం వంటి అంశాలపై చర్చించింది. ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాదం, సీమాంతర ఉగ్రవాద నెట్‌వర్క్‌లపై అంతర్జాతీయ సమాజం సమిష్టిగా నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని భారత్ పిలుపునిచ్చింది. ఉగ్రవాదం కారణంగా భారత్ చాలా కాలంగా తీవ్ర పరిణామాలను ఎదుర్కొంటోందని భారత ప్రతినిధి బృందం పేర్కొంది. ఈ ముప్పును సమర్థంగా ఎదుర్కొనేదానికి అంతర్జాతీయ స్థాయిలో నియమాల ఆధారిత వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పింది. ఉగ్రవాద కార్యకలాపాలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేయడం, అక్రమ ఆర్థిక లావాదేవీల ద్వారా ఉగ్ర సంస్థలకు నిధులు సమకూర్చడం వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి దేశాల మధ్య సమన్వయం కీలకమని తెలిపింది. సైబర్ ప్రపంచంలో ఉగ్రవాద ప్రచారాన్ని అడ్డుకోవడం, నిఘా సమాచారాన్ని పంచుకోవడం, చట్టపరమైన వ్యవస్థలను పటిష్టం చేయడం వంటి చర్యలకు భారత్ కట్టుబడి ఉందని వెల్లడించింది. సరిహద్దుల ఆవల ఉన్న ఉగ్రవాద స్థావరాలను నిర్మూలించకుండా శాశ్వత శాంతి సాధ్యం కాదని స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద నిరోధక సామర్థ్యాలను పెంపొందించేందుకు సాంకేతిక సహకారం, శిక్షణ, సమాచార మార్పిడి మరింత విస్తరించాలని సూచించింది. ఇదిలా ఉండగా, ఉగ్రవాదంపై పాకిస్తాన్ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని భారత్ ఐరాస వేదికగా తీవ్రంగా విమర్శించింది.

# స్మిత్ మచ్చర్‌కు ఇజ్రాయెల్ అత్యున్నత పౌర పురస్కారం



ఇజ్రాయెల్ :

ఫ్లైదుబాయ్ విమానంపై జరిగిన హైజాక్ యత్నాన్ని ధైర్యసాహసాలతో అడ్డుకుని, ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌కు ఇజ్రాయెల్ అత్యున్నత పౌర సాహస పురస్కారాన్ని ప్రకటించింది. 'ప్రెసిడెన్షియల్ అవార్డ్ ఫర్ సివిలియన్ హీరోయిజం'కు ఆయనను ఎంపిక చేసినట్లు ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ వెల్లడించారు. విమానంలో ఉన్న ప్రయాణికులతోపాటు నేలపై ఉన్న ప్రజల ప్రాణాలను కాపాడటంలో స్మిత్ అసాధారణ తెగువ ప్రదర్శించారని కొనియాడారు. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నందున, ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత అవార్డును అందజేస్తామని ప్రకటించారు. ప్రాణాలకు తెగించి బాధ్యతలను నిర్వహించిన ఆయన ధైర్యం, వృత్తి నైపుణ్యం ప్రశంసనీయమని పేర్కొన్నారు. సెప్టెంబర్ 30న ఫ్లైదుబాయ్ విమానాన్ని హైజాక్ చేసి కూల్చివేయడానికి జరిగిన ప్రయత్నాన్ని కెప్టెన్ స్మిత్ మచ్చర్ సమర్థంగా అడ్డుకున్నారు. విమానంలో కోపైలట్‌గా ఉన్న ఒమన్‌కు చెందిన హమ్మౌలీ, కాక్‌పిట్‌లో స్మిత్‌పై దాడి చేయడంతో పరిస్థితి ఒక్కసారిగా ప్రమాదకరంగా మారింది. ఈ ఘర్షణ కారణంగా విమానం వేగంగా కిందికి దిగడం ప్రారంభించింది. అయితే, పరిస్థితిని చాకచక్యంగా ఎదుర్కొన్న సిబ్బంది విమానాన్ని దారి మళ్లించి సౌదీ అరేబియాలోని తబూక్‌లో అత్యవసరంగ ల్యాండ్ చేశారు. దీంతో విమానంలోని ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడగలిగారు. ఈ ఘటనలో స్మిత్‌కు సాయపడిన ఆరుగురు ఇజ్రాయెల్ పౌరులకు అధ్యక్షుడు హెర్జోగ్ ఇప్పటికే హీరోయిజం అవార్డులను ప్రదానం చేశారు. సంక్షోభ సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఇతరులను కాపాడిన వారి సేవలను ప్రశంసించారు. కెప్టెన్ స్మిత్ మచ్చర్ సాహసాన్ని అంతర్జాతీయ స్థాయిలో పలువురు ప్రముఖులు కొనియాడారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆయన ధైర్యాన్ని ప్రశంసించారు. అమెరికా కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి సైతం స్మిత్ అసాధారణ సాహసంతో ఎంతోమంది ప్రాణాలను కాపాడారని పేర్కొన్నారు. విమానంలో చిన్నారులు, అమెరికా పౌరులు కూడా ఉన్నారని తెలిపారు. మరోవైపు, అబుదాబి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్మిత్ ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. యూఏఈలోని భారత రాయబార కార్యాలయం ఆయన కుటుంబ సభ్యులు, వైద్యులు, స్థానిక అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ అవసరమైన సహాయాన్ని అందిస్తోంది. స్మిత్ త్వరగా కోలుకుని తిరిగి విధుల్లో చేరాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

## ఏపీలో స్థానిక ఎన్నికలకు లైన్ క్లియర్.

(మొదటి తరువాయి)

వాదనను ధర్మాసనం అంగీకరించలేదు. ఎస్ఐఆర్ తాజా జాబితా సిద్ధమైనా, పాత ఓటర్ల జాబితాతోనైనా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని స్పష్టం చేసినట్లు సమాచారం.వార్డుల పునర్విభజన అంశంపైనా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికిప్పుడు వార్డుల పునర్విభజన చేపట్టాలని కోరడం ఎన్నికలను ఆలస్యం చేసే ప్రయత్నమేనన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. దీంతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అడ్డంకులు తొలగినట్లయింది

## తెలంగాణ జలదోపిడీ ఆపండి!

(మొదటి తరువాయి)

దీనిని మినహాయిస్తే ప్రస్తుతం జలాశయంలో కేవలం 39.24 టీంఎంసీలే ఉన్నాయని తెలిపారు. గురువారం నాటికి తెలంగాణ విద్యుదుత్పత్తి కోసం ఏకంగా 42.378 టీఎంసీలు వాడేసిందన్నారు. ఇదే కొనసాగితే కరువుపీడిత సీమకు తాగునీరు కూడా దొరకని దుస్థితి నెలకొంటుందన్నారు. తెలంగాణ ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా ఎడమ గట్టు విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా నీటిని తోడేస్తోందని.. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబి) స్వతంత్ర సంస్థగా విధులు నిర్వహించలేకపోతోందని నిమ్మల ఆక్షేపించారు.

## సంజామలను కరువు మండలంగా ప్రకటించాలి

(మొదటి తరువాయి)



కోరారు. సంజామల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల మాజీ జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, సీపీఐ నాయకులు, వివిధ మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు తీసుకోండి



న్యూఢిల్లీ, అక్టోబర్ 9: దేశంలో ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాలపై కొనసాగుతున్న వివాదం నేపథ్యంలో ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి పలు డిమాండ్లు చేశాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరడంతో పాటు, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సమీక్ష (సర్) ప్రక్రియను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశాయి. ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్నాయని ఆరోపిస్తున్న అవకతవకలపై రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించాయి. సీఈసీ, ఎన్నికల కమిషనర్లకు జీవితకాల రక్షణ కల్పించే 2023 నాటి చట్టాన్ని రద్దు చేయాలని, అన్ని ఎన్నికల్లోనూ తిరిగి పేపర్ బ్యాలెట్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితాల నుంచి అక్రమంగా తొలగించారని ఆరోపిస్తున్న 13.3 కోట్ల మంది పేర్లను పునరుద్ధరించాలని కోరింది. ఓట్ల చోరీకి సంబంధించి ఆధారాలు ఉన్నాయని పేర్కొంటూ గత రెండేళ్లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయాలని కూడా విజ్ఞప్తి చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో దేశ ఎన్నికల వ్యవస్థ, ప్రజాస్వామ్య ప్రక్రియ బలహీనపడుతున్నాయని ఇండియా కూటమి నేతలు ఆరోపించారు. దేశ జనాభాలో 60 శాతానికి పైగా ప్రాతినిధ్యం వహిస్తున్న కూటమి ఎంపీలు ఈ అంశంపై రాష్ట్రపతి జోక్యం కోరినట్లు తెలిపారు. అయితే, ఇవన్నీ ప్రతిపక్షాలు వినతిపత్రంలో చేసిన ఆరోపణలు, డిమాండ్లు మాత్రమే. హర్యానా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బిహార్, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని ఇండియా కూటమి ఆరోపించింది. మరికొన్ని అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లోనూ ఈవీఎంలు, ఓటర్ల జాబితాలను బీజేపీకి అనుకూలంగా మార్చారని వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపింది. వరుస ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని నిరూపించేందుకు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని విపక్ష నేతలు రాష్ట్రపతికి వివరించారు.

# జనసేన ఎమ్మెల్యే బాలరాజుపై పవన్ కల్యాణ్ సీరియస్.. విచారణకు కమిటీ

-జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు జారీ
-పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై విచారణకు కమిటీ
-బాలరాజు వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తితో ఉన్న పవన్
-గతంలో హెచ్చరించినా తీరు మారకపోవడంతో ఆగ్రహం
కమిటీ నివేదిక ఆధారంగా -తదుపరి చర్యలు ఉంటాయని ప్రకటన



**అమరావతి, అక్టోబర్ 9, ( నేటి దర్శిని )**
జనసేన పార్టీకి చెందిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై వస్తున్న ఆరోపణల వ్యవహారంపై డిప్యూటీ సీఎం, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. బాలరాజుపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపేందుకు పవన్ కల్యాణ్ ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తున్నట్లు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నిర్ణయం పార్టీలో అంతర్గతంగా కలకలం రేపుతోంది.

**ఎమ్మెల్యే బాలరాజు వ్యవహారశైలి, పనితీరుపై పవన్ కల్యాణ్ తీవ్ర అసంతృప్తి**
గత కొంతకాలంగా ఎమ్మెల్యే బాలరాజు వ్యవహారశైలి, పనితీరుపై పవన్ కల్యాణ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల మీడియాలో ఆయనపై ఆరోపణలు రావడంతో ఈ వ్యవహారాన్ని అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. గతంలోనే బాలరాజును పార్టీ కార్యాలయానికి పిలిపించి, గిరిజన ప్రజలకు పారదర్శకమైన, నీతివంతమైన పాలన అందించాలని, వారి సేవకే అంకితం కావాలని పవన్ కల్యాణ్ వ్యక్తిగతంగా సూచించారు. అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పు రాకపోవడంపై పవన్ తీవ్ర అసహనం, విసుగుతో ఉన్నట్లు పార్టీ ప్రకటనలో పేర్కొన్నారు.

**పార్టీకి ఇబ్బందికరంగా వ్యవహార శైలి**
ఓవైపు 'అడవితల్లి బాట' వంటి కార్యక్రమాల ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పార్టీ కృషి చేస్తుంటే, అదే గిరిజన ప్రాంతం నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధి వ్యవహారశైలిపై వస్తున్న ఆరోపణలు పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. ఈ నేపథ్యంలోనే పవన్ కల్యాణ్ ఈ విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను నిగ్గు తేల్చి, పార్టీ అధ్యక్షుడికి నివేదిక సమర్పించనుంది. ఆ నివేదిక ఆధారంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై తదుపరి చర్యలు ఉంటాయని జనసేన పార్టీ స్పష్టం చేసింది. దీంతో బాలరాజు రాజకీయ భవిష్యత్తుపై ఉత్కంఠ నెలకొంది

# మిట్ట కోడూర్ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**పరిగి అక్టోబర్ 9, ( నేటి దర్శిని )**
మండలంలోని మిట్ట కోడూ ర్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎండీ ఉస్మాన్ అలీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గునుగు, బంతి, తంగేడు తదితర పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ ఆడిపాడారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక అని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ అనిత రాణి, ఉపాధ్యాయులు కృష్ణయ్య, నర్సింలు, రాజు, కవిత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బాలికా విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారానే సమాజాభివృద్ధి




**రామచంద్రాపురం, అక్టోబర్ 9, ( నేటి దర్శిని )**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం మండలం కాపవరం గ్రామంలో బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకొని ముందస్తు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న సామాజిక కార్యకర్త డి అర్జునరావు మాట్లాడుతూ బాలికా విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. బాలికా హక్కుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ క్రియాశీలక భాగస్వామ్యులు కావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు,బీమాబాయి మహిళా మండలి సిబ్బంది పాల్గొన్నారు.

### స్థానిక ఎన్నికలు ఆపేందుకు
# వైసీపీ కుట్ర...మంత్రి కొల్లు రవీంద్ర

-ఎన్నికలు జరగకపోతే రూ. 12,500 కోట్ల కేంద్ర నిధులు ఆగిపోతాయని వెల్లడి
-బీసీలకు 34% రిజర్వేషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టీకరణ
-గతంలో వైసీపీయే రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని విమర్శ
-ఓటమి భయంతోనే వైసీపీ కోర్టులకు వెళ్లి ఎన్నికలను అడ్డుకుంటోందని వ్యాఖ్య



**అమరావతి, అక్టోబర్ 9, ( నేటి దర్శిని )**
వైసీపీ స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతోందని, తద్వారా రాష్ట్రానికి రావాల్సిన రూ. 12,500 కోట్ల ఆర్థిక సంఘం నిధులను నిలిపివేయాలని చూస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం మంగళగిరి లోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.స్వర్గీయ ఎన్టీఆర్ బీసీలకు రాజకీయ రిజర్వేషన్ల పునాది వేయగా, ముఖ్యమంత్రి చంద్రబాబు వాటిని 34 శాతానికి పెంచి వారి ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేశారని కొల్లు రవీంద్ర గుర్తుచేశారు. అయితే, గత ప్రభుత్వం కుట్రపూరితంగా కోర్టుల ద్వారా ఈ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. దీనివల్ల దాదాపు 16,800 మంది బీసీలు రాజ్యాంగబద్ధమైన పదవులను కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**34 శాతం రిజర్వేషన్ల అమలుపై అసెంబ్లీలో తీర్మానం**
ఎన్నికల హామీ మేరకు 34 శాతం రిజర్వేషన్ల అమలుపై అసెంబ్లీలో తీర్మానం చేశామని, దీనిపై ఏర్పాటు చేసిన రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని బీసీ కమిషన్ నివేదిక త్వరలో ప్రభుత్వానికి అందనుందనిమంత్రి తెలిపారు. స్థానిక సంస్థల పదవీకాలం ముగిసినందున 16వ ఆర్థిక సంఘం నిధులు సాధించాలంటే ఎన్నికల నిర్వహణ తప్పనిసరని, ఈ క్రమంలో ప్రభుత్వం ముందుకు వెళుతుంటే.. ఓటమి భయంతో వైసీపీ మరోసారి కోర్టులను ఆశ్రయించి ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవాలని చూస్తోందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన రూ.12,500 కోట్లు రాకుండా అడ్డుకోవడమే వారి దురుద్దేశమని విమర్శించారు.

**వైసీపీ పాలనలో గ్రామీణ వ్యవస్థ సర్వనాశనమైందన్న మంత్రి**
గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామీణ వ్యవస్థ సర్వ నాశనమైందని కొల్లు రవీంద్ర మండిపడ్డారు. రాజశేఖర్ రెడ్డి హయాం నుంచే బీసీల ఎదుగుదలను అడ్డుకుంటున్నారని, జగన్ పాలనలో తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య వంటి బీసీ నేతల హత్యలు జరిగాయని ఆరోపించారు. ఇప్పుడు కల్లబొల్లి మాటలతో బీసీలను మభ్యపెట్టాలని చూస్తున్నారని, వారి నాటకాలను బీసీ సోదరులు ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మరని హితవు పలికారు.

**ప్రభుత్వం బీసీ కార్పొరేషన్లకు నిధులు**
ప్రస్తుత కూటమి ప్రభుత్వం బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయిస్తోందని, నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు వంటి హామీలను నెరవేరుస్తోందని వివరించారు. చట్టపరంగా అన్ని అడ్డంకులను అధిగమించి బీసీలకు న్యాయం చేస్తామని, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్నికలు నిర్వహించి తీరుతామని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు

# 'బీసీ'లకు '34 శాతం' 'రిజర్వేషన్ల'పై వెనక్కి తగ్గేది లేదు.. ఇది మా విధానం...టీడీపీ

-స్థానిక సంస్థల్లో బీసీలకు 34% రిజర్వేషన్ల అమలుపై కీలక ప్రకటన
-చట్ట పరంగా వీలుకాకపోయినా పార్టీ పరంగా సీట్లు కేటాయిస్తామని వెల్లడి
-వైసీపీ వల్లే బీసీలు రిజర్వేషన్లు కోల్పోయారని టీడీపీ ఆరోపణ
-గత, ప్రస్తుత ప్రభుత్వాల్లో బీసీల కోసం అమలు చేస్తున్న పథకాల వెల్లడి
-బీసీల రాజకీయ ఎదుగుదలకు ఎప్పుడూ అండగా ఉంటామని స్పష్టీకరణ
-సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో టీడీపీ ప్రకటన

**అమరావతి, అక్టోబర్ 9, ( నేటి దర్శిని )**
సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో తెలుగుదేశం పార్టీ తన విధానాన్ని స్పష్టం చేసింది. చట్టపరమైన ఆమోదం లభించకపోయినా, పార్టీ తరఫున బీసీలకు 34 శాతం సీట్లు కేటాయించి వారి రాజకీయ గౌరవాన్ని కాపాడతామని కీలక ప్రకటన చేసింది. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసేందుకు జీవో 105, 1065 ద్వారా 34 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రయత్నం చేశామని, అయితే వైసీపీ నేతలు కోర్టులకు వెళ్లడం వల్లే హైకోర్టు ఆ జీవోలను కొట్టివేసిందని టీడీపీ ఆరోపించింది.
ఈ విషయంలో తాము వెనక్కి తగ్గకుండా సుప్రీంకోర్టును ఆశ్రయించామని, సీనియర్ న్యాయవాదులను నియమించి పోరాడినా దురదృష్టవశాత్తు అనుకూల తీర్పు రాలేదని తెలుగుదేశం పార్టీ గుర్తుచేసింది. అయినా సరే, బీసీల విషయంలో తమ నిబద్ధతను చాటుకుంటామని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీపరంగా 34 శాతానికి తగ్గకుండా బీసీ వర్గాలకు సీట్లు కేటాయిస్తామని ఉద్ఘాటించింది. బీసీల రాజకీయ ఎదుగుదలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని, వారికి న్యాయం చేయడమే తమ లక్ష్యమని, కానీ వారి హక్కులను అడ్డుకోవడమే వైసీపీ వైఖరి అని విమర్శించింది.

**కుట్రలు చేసి, కోర్టులకు వెళ్లి..రిజర్వేషన్లు పోయేలా చేసి..**
కుట్రలు చేసి, కోర్టులకు వెళ్లి రిజర్వేషన్లు పోయేలా చేసి, మళ్లీ తమపైనే ఆరోపణలు చేయడం వైసీపీకి అలవాటుగా మారిందని దుయ్యబట్టింది. నాడు హైకోర్టు రిజర్వేషన్లు కొట్టివేసినప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ, బీసీలకు న్యాయం చేసేందుకు కనీస ప్రయత్నం కూడా చేయలేదని ఆక్షేపించింది.

**బీసీలకు అండగా నిలిచింది టీడీపీనే...**
బీసీలకు రాజ్యాధికారం అనే మాటను తొలిసారిగా పలికి, వారికి అవకాశాలు కల్పించింది తెలుగుదేశం పార్టీయేనని ఈ సందర్భంగా టీడీపీ గుర్తుచేసింది. పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ కారణంగా నాలుగు దశాబ్దాల క్రితమే బీసీల గళం వినిపించిందని, ఆ తర్వాత తాము ఆ స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకెళ్లామని తెలిపింది. 1995లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచిన ఘనత తమదేనని పేర్కొంది. బీసీలు తమకు అండగా ఉన్నారనే అక్కసుతోనే గత వైసీపీ ప్రభుత్వం వారిని అణగదొక్కే ప్రయత్నం చేసిందని, 30 ఏళ్లుగా అమలవుతున్న 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని ఆరోపించింది. దీనివల్ల సుమారు 16,800 మంది బీసీలు పదవులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేసింది.

**గత, ప్రస్తుత ప్రభుత్వాల్లో బీసీలకు మేలు**
బీసీ ఫెడరేషన్లకు నాంది పలికింది కూడా తమ ప్రభుత్వమేనని టీడీపీ తెలిపింది. కులవృత్తులు, చేతి వృత్తులను పరిరక్షించేందుకు, వారి జీవనోపాధిని మెరుగు పరిచేందుకు 'ఆదరణ' వంటి పథకాలను తీసుకువచ్చామని, ఈ పథకం కింద 341 రకాల పనిముట్లను 90 శాతం సబ్సిడీతో అందించామని గుర్తు చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వివరించింది. ఇందులో భాగంగా వడ్డెర్లకు 10 శాతం మైనింగ్ లీజులు, గీత కార్మికులకు 10 శాతం ఎక్సైజ్ షాపులు కేటాయించామని తెలిపింది.

**నేతన్న సేవ' పథకం కింద ఏడాదికి రూ.25,000 ఆర్థిక సహాయం**
'నేతన్న సేవ' పథకం కింద ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.25,000 ఆర్థిక సహాయం అందిస్తున్నామని, చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్ మగ్గాలకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని పేర్కొంది.

**మత్స్యకారులకు ఆర్థిక సాయం**
వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయం అందించే పథకాన్ని తామే ప్రారంభించామని, ఇప్పుడు 'మత్స్యకార సేవ' పథకం కింద ఆ సహాయాన్ని రూ.20,000కు పెంచామని వివరించింది. సబ్సిడీపై బోట్లు, డీజిల్ అందిస్తూ, తీరప్రాంతంలో వారి హక్కులకు రక్షణ కల్పిస్తున్నామని తెలిపింది. గత ప్రభుత్వం అన్యాయంగా తెచ్చిన జీవో నెంబర్ 217ను రద్దు చేసి మత్స్యకార సొసైటీల హక్కులను కాపాడామని, మత్స్యకార మహిళలకు సీ వీడ్ పెంపకంపై శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నామని చెప్పింది.

**34 శాతం రిజర్వేషన్ల హామీని నిలబెట్టుకుంటామన్న టీడీపీ**
నాయీ బ్రాహ్మణులు నిర్వహించే సెలూన్లకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, దేవాలయాల్లో పనిచేసే వారికి భృతిని రూ.15,000 నుంచి రూ.25,000కు పెంచామని తెలిపింది. స్వర్ణకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశామని పేర్కొంది. చట్టపరంగా ఏది ఏమైనప్పటికీ, రాజకీయంగా బీసీలకు ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్ల హామీని నిలబెట్టుకుంటామని టీడీపీ పునరుద్ఘాటించింది

# సాయికృష్ణది కస్టడీ హత్యే.. ఛార్జిషీట్‌లో సంచలన విషయాలు!

-విజయవాడ సాయికృష్ణది కస్టడీ మృతేనని తేల్చిన సిట్
-సీఐ సహా ఏడుగురు పోలీసులే నిందితులుగా ఛార్జిషీట్
-సాక్ష్యాలను మాయం చేసేందుకు అన్ని విధాలా ప్రయత్నించిన పోలీసులు
-120 మంది సాక్షులను విచారించి కోర్టుకు నివేదిక సమర్పణ

**విజయవాడ,అక్టోబర్ 9, ( నేటి దర్శిని ):**
రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ కస్టడీ మృతి కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) న్యాయస్థానానికి ప్రాథమిక ఛార్జిషీట్‌ను సమర్పించింది. విజయవాడలోని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సాయికృష్ణ మృతికి పోలీసుల చిత్రహింసలే ప్రధాన కారణమని సిట్ తన నివేదికలో నిర్ధారించింది. ఈ కేసులో అప్పటి సీఐ నాగరాజుతో పాటు మొత్తం ఏడుగురు పోలీసులను నిందితులుగా పేర్కొంది.



**అత్యంత నిష్పక్షపాతంగా దర్యాప్తు**
ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కేసులో అత్యంత నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపినట్లు సిట్ కోర్టుకు వివరించింది. దర్యాప్తులో భాగంగా సుమారు 120 మంది సాక్షులను విచారించిన అధికారులు, కీలక ఆధారాలతో కూడిన 263 పత్రాలను 86 పేజీల ఛార్జిషీట్‌కు జతచేశారు. నాన్-బెయిలబుల్ వారెంట్‌పై ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి సాయికృష్ణను విజయవాడకు తరలించిన పోలీసులు, కృష్ణలంక స్టేషన్‌లో అతడిపై అమానవీయంగా దాడి చేసినట్లు తేలింది. తీవ్ర చిత్రహింసల కారణంగా ఆరోగ్యం క్షీణించి సాయికృష్ణ ప్రాణాలు కోల్పోగా, అనంతరం నిందితులు మృతదేహాన్ని దుప్పటిలో చుట్టి, అర్ధరాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా శ్మశానవాటికకు తరలించి దహనం చేసినట్లు సిట్ తన నివేదికలో వెల్లడించింది.

**సాక్ష్యాధారాలను ధ్వంసం చేసినట్లు సిట్ స్పష్టం**
ఈ మరణాన్ని కప్పిపుచ్చేందుకు నిందితులు పక్కా ప్రణాళికతో సాక్ష్యాధారాలను ధ్వంసం చేసినట్లు సిట్ స్పష్టం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా లాకప్ డైరీ, జనరల్ డైరీ, సెంట్రీ బుక్‌లో నిందితుడికి సంబంధించిన ఎలాంటి వివరాలను నమోదు చేయలేదని పేర్కొంది. ఘటన అనంతరం స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజీని మాయం చేయడం, నేర ఆనవాళ్లు దొరక్కుండా పోలీస్ స్టేషన్‌కు రంగులు వేయించడం, లాకప్‌ను నీళ్లతో కడిగేయడం వంటి చర్యల ద్వారా సాక్ష్యాలను తుడిచిపెట్టే ప్రయత్నం చేసినట్లు ఛార్జిషీట్‌లో పొందుపరిచారు.సాయికృష్ణ మృతికి ఈ ఏడుగురు నిందితులే ప్రత్యక్ష బాధ్యులని సిట్ తేల్చిచెప్పింది. అయితే, ఈ కేసులో లోతైన దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని ప్రత్యేక దర్యాప్తు బృందం న్యాయ స్థానానికి విన్నవించింది

# యూట్యూబ్‌లో రికార్డులు సృష్టిస్తున్న విజయ్ దేవరకొండ 'రణబాలి' ట్రైలర్!




విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన మోస్ట్ అవేటెడ్ పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి' ట్రైలర్ యూట్యూబ్‌లో విడుదలైనప్పటి నుంచీ రికార్డులతో దూసుకుపోతోంది. ఈ ట్రైలర్ విడుదలై 24 గంటలు గడవకముందే 4.5 మిలియన్ వ్యూస్ దాటింది. రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం 1854 -- 1878 మధ్య కాలంలో రాయలసీమ ప్రాంత కరువు నేపథ్యంలో బ్రిటిష్ పాలకుల దౌర్జన్యాలు, వారి హయాంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా రాబోతుంది. ఈ చిత్రంలో 'శింగనమల బొబ్బిలి రణబాలి' అనే పవర్‌ఫుల్ తిరుగుబాటు యోధుడి పాత్రలో విజయ్ దేవరకొండ విశ్వరూపం చూపించారు. ఆయన భార్య 'జయమ్మ' పాత్రలో రష్మిక మందన్న నటించగా, వీరిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు మరియు పోరాట ఘట్టాలు ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచాయి. అలాగే ప్రముఖ హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ ఈ చిత్రంలో సర్ థియోడర్ హెక్టర్ అనే బ్రిటిష్ విలన్ పాత్రలో నటించారు. ఈ భారీ పీరియడ్ మూవీ దసరా కానుకగా అక్టోబర్ 16న తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది.



## దివ్యభారతి హాట్ పోజులు..

# యష్ 'టాక్సిక్'కు మరో షాక్..

### -రూ.200 కోట్ల ఓటీటీ డీల్‌పై నీలినీడలు!



కన్నడ రాకింగ్ స్టార్ యష్‌కు 'కేజీఎఫ్' సిరీస్ ఎలాంటి గుర్తింపును తీసుకొచ్చిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ సినిమాలతో దేశవ్యాప్తంగా భారీ అభిమానగణాన్ని సంపాదించుకున్న ఆయన.. తదుపరి చిత్రాల విషయంలో ఎంతో జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే దర్శకురాలు గీతూ మోహన్‌దాస్‌తో కలిసి 'టాక్సిక్' అనే భారీ పాన్ ఇండియా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అయితే ఈ సినిమాకు సంబంధించిన ఓటీటీ బిజినెస్‌పై తాజాగా పలు వార్తలు వినిపిస్తున్నాయి. 'టాక్సిక్' సినిమాపై మొదటి నుంచీ భారీ అంచనాలు నెలకొన్నాయి. యష్ చాలా కాలం తర్వాత హీరోగా నటిస్తున్న సినిమా కావడంతో అభిమానులు ఈ ప్రాజెక్టుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే సినిమా విడుదలకు ముందే డిజిటల్ హక్కుల విషయంలో భారీ మొత్తంలో బిజినెస్ జరగనుందనే ప్రచారం సాగింది.ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 ఈ సినిమా డిజిటల్ హక్కులను దక్కించుకోనున్నట్లు వార్తలు వచ్చాయి. తొలుత ఈ ఒప్పందం విలువ సుమారు రూ.200 కోట్ల వరకు ఉండొచ్చని ప్రచారం జరిగింది. అయితే తాజా ప్రచారం ప్రకారం, సినిమా హక్కుల కోసం మొదట అనుకున్న స్థాయిలో డిమాండ్ లేదని తెలుస్తోంది. రూ.200 కోట్లుగా వినిపించిన ఓటీటీ డీల్ విలువ రూ.30 కోట్లకు తగ్గినట్లు కొన్ని కథనాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా, ఈ మొత్తం విషయంలోనూ తుది ఒప్పందం కుదిరిందా లేదా అనే దానిపై స్పష్టత లేదు. ఈ వార్తలపై చిత్రబృందం లేదా సంబంధిత ఓటీటీ సంస్థ అధికారిక ప్రకటన చేయలేదు.'కేజీఎఫ్' సినిమాల తర్వాత యష్ తన తదుపరి ప్రాజెక్ట్‌ను ప్రకటించడానికి చాలా సమయం తీసుకున్నారు. చివరకు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో 'టాక్సిక్' చిత్రాన్ని ప్రారంభించారు. విభిన్నమైన కథాంశం, భారీ నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు ప్రచారం జరిగింది. దీంతో ఈ సినిమాపై దేశవ్యాప్తంగా సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. అయితే సినిమా బాక్సాఫీస్ ఫలితం, ఓటీటీ హక్కుల ఒప్పందం వంటి అంశాలపై వస్తున్న వార్తలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. థియేటర్లలో ఆశించిన ఫలితం రాకపోతే డిజిటల్ హక్కుల విషయంలోనూ నిర్మాతలు అంచనాలను సవరించుకోవాల్సి వస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 'టాక్సిక్' డిజిటల్ హక్కులను జీ5 దక్కించుకుందనే ప్రచారం ఉన్నప్పటికీ, స్ట్రీమింగ్ ప్లాట్‌ఫారమ్, విడుదల తేదీపై అధికారిక సమాచారం అందుబాటులో లేదు. అలాగే రూ.200 కోట్ల నుంచి రూ.30 కోట్లకు ఒప్పందం విలువ తగ్గిందనే వార్తలను కూడా ధ్రువీకరించే అధికారిక



# ఆపద్ధతి నాకు నచ్చలేదు

'కథ పాతదే అయినా.. తెరకెక్కించే విధానం కొత్తగా ఉంటే చాలు సక్సెస్ అదే వస్తుంది. అందుకే.. కథ ఎంత ముఖ్యమో, దాన్ని తెరకెక్కించే దర్శకుడి అభిరుచి కూడా అంతే ముఖ్యం' అంటున్నది మలయాళ మందారం అనుపమ పరమేశ్వరన్. సినిమాలను ఎంపిక చేసుకునే విషయంలో తాను ఏ విధమైన అంశాలను పరిగణనలోకి తీసుకుంటుందో ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరంగా తెలిపింది అనుపమ పరమేశ్వరన్.'ఇటీవల ఓ కథ విన్నాను. చాలా బాగుంది. అయితే.. కథ రైటర్ వినిపించారు. డైరెక్టర్ మాత్రం సైలెంట్‌గా కూర్చొని, నాతోపాటు వింటున్నారు. నాకెందుకో ఆ పద్ధతి నచ్చలేదు. కథ చెప్పాల్సింది దర్శకుడు. దాన్ని తెరకెక్కించాల్సిందీ దర్శకుడే. అలాంటి స్థానంలో ఉండి, అలా సైలెంట్‌గా కూర్చోవడం నాకెందుకో ఇబ్బందిగా అనిపించింది. సినిమా లొకేషన్ ఓ పిక్నిక్‌లా ఉండాలని కోరుకుంటాన్నేను. డైరెక్టర్ సైతం మాతో కలిసిపోవాలి. సరదా సరదాగా షూటింగ్ జరగాలి. అలా అయితే అవుట్‌పుట్ కూడా బావుంటుంది. అందుకే.. యువతరంతో పనిచేసేందుకే నేనెక్కువగా ఇష్టపడతా. అలాగే కొత్తవాళ్లతో ఇంటిమేటెడ్ సీన్స్ అంటే కూడా నేను ఇబ్బందిగా ఫీలవుతా. కథ డిమాండ్ చేసినా, పరిచయం లేనివారితో చనువుగా ఉండే సన్నివేశాలు చేయడం కాస్త కష్టంగా ఉంటుంది. నా వరకూ సినిమా ఓకే చేసే విషయంలో కథతోపాటు దర్శకుడు కూడా నాకు ట్యూన్ అవ్వాలి. అప్పుడే సినిమాను అంగీకరిస్తా. కథ బాగుండి, దర్శకుడు విషయంలో డౌట్ వల్ల వదులుకున్న ప్రాజెక్టులు చాలా ఉన్నాయి' అంటూ గుర్తు చేసుకున్నది అనుపమ పరమేశ్వరన్.

# శర్వానంద్ 'భోగి' నుంచి జానపద గీతం విడుదల..

### పల్లె జీవితాన్ని కళ్లకు కట్టిన 'ఎగిలి వరంగ'




టాలీవుడ్‌లో వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్న హీరో శర్వానంద్ ఈసారి మాస్ హీరోగా తన సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. సంపత్ నంది దర్శకత్వంలో ఆయన నటిస్తున్న యాక్షన్ డ్రామా 'భోగి'పై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. ఇటీవల విడుదలైన టీజర్ సినిమాలోని యాక్షన్‌తో పాటు ఇతర అంశాలను పరిచయం చేయగా.. తాజాగా చిత్రబృందం తొలి పాటను విడుదల చేసింది. 'ఎగిలి వరంగ' పేరుతో వచ్చిన ఈ జానపద గీతం పల్లె జీవనశైలిని, అక్కడి ప్రజల సంస్కృతిని అందంగా ఆవిష్కరిస్తోంది. 'ఎగిలి వరంగ' పాటలో గ్రామీణ జీవితంలోని ఎన్నో కోణాలను చూపించారు. తెల్లవారుజామున పల్లెల్లో మొదలయ్యే సందడి, తమ తమ పనులకు వెళ్లే ప్రజలు, వారి వృత్తులు, కుటుంబాల మధ్య ఉండే అనుబంధాలు వంటి అంశాలను పాటలో పొందుపరిచారు. గ్రామంలోని పెద్దల పట్ల ప్రజలు చూపించే గౌరవం, పటేల్ పట్ల ఉండే మర్యాదను కూడా ఈ గీతం ప్రతిబింబిస్తోంది.పల్లె ప్రజలు తమ కష్టాలను లెక్కచేయకుండా రోజువారీ పనుల్లో నిమగ్నమయ్యే విధానాన్ని పాటలో సహజంగా చూపించారు. అదే సమయంలో గ్రామీణ సమాజంలో కనిపించే భూస్వామ్య పెత్తనం, అణచివేత వంటి అంశాలనూ కొన్ని దృశ్యాల ద్వారా పరిచయం చేశారు. దీంతో ఈ పాట కేవలం వినోదానికే పరిమితం కాకుండా, సినిమా కథలోని సామాజిక నేపథ్యాన్ని కూడా సూచిస్తోంది. ఈ పాటకు చంద్రబోస్ అందించిన సాహిత్యం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. పల్లె వాతావరణానికి తగిన పదాలతో ఆయన పాటకు సహజత్వాన్ని తీసుకొచ్చారు. భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం జానపద శైలికి మరింత బలాన్ని ఇచ్చింది. నల్గొండ గద్దర్ నర్సన్న, కందుకూరి శంకర్ బాబు, రిలారే గోపాల్ తమ గాత్రాలతో పాటకు ప్రత్యేకమైన జోష్ తీసుకొచ్చారు. ఇక శర్వానంద్, అనుపమ పరమేశ్వరన్ పల్లెటూరి పాత్రలకు తగ్గట్టుగా కనిపిస్తున్నారు. వారి వేషధారణ, పాటలోని గ్రామీణ నేపథ్యం సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. మరో కథానాయికగా డింపుల్ హయాతి కూడా ఈ చిత్రంలో నటిస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంపత్ నంది దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ద్వారా శర్వానంద్ మాస్ ప్రేక్షకులకు మరింత చేరువ కావాలని చూస్తున్నారు. టీజర్ తర్వాత విడుదలైన తొలి పాటతో సంగీత ప్రచారాన్ని ప్రారంభించిన చిత్రబృందం, జానపద గీతం ద్వారా సినిమా ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేసింది. 'భోగి' చిత్రం 2026 నవంబర్ 12న థియేటర్లలో విడుదల కానుంది. యాక్షన్, గ్రామీణ నేపథ్యం, సామాజిక అంశాలతో రూపొందుతున్న ఈ సినిమా శర్వానంద్ కెరీర్‌లో ఎలాంటి గుర్తింపు తెచ్చుకుంటుందో చూడాలి.

Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, NTR district, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450